క్లుప్తంగా

వేసవి శిక్షణ శిబిరాలతో మానసిక వికాసం


చెస్ ఆడుతున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతుంది. నీతి కథలు చెప్పడం, వార్తాపత్రికలు చదివించారు.వీటితో పాటు పలు క్రీడలు నిర్వహించడంతో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి శిరీష మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొవడం వల్ల వారిలో మేథోసంపత్తి పెరుగుతుందన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి నిందితులను పట్టుకుని వారి నుంచి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు కేరళ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. తీరు వెల్ల థామస్(27), చారోన్(24) అరుకలో గంజాయి కొనుగోలు చేసి కేరళ తీసుకు వెళ్లేందుకు యత్నిస్తుండగా రైల్వే స్టేషన్ దగ్గరలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాశర్ల ప్రసాద్ తదితరులు

సింహాచలం: దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం అడవివరంలో ఘనంగా నిర్వహించారు. ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైన్స్ అండ్ టెక్నాలజీని తదేశ యువతకు అందించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ మాజీ డైరెక్టర్ కొలుసు లక్ష్మణరావు, సింహాచలం దేవస్థానం రిటైర్డ్ ఉద్యోగులు ఎస్ఎస్ఎస్ కుమార్, వెలమలపల్లి చిట్టి, నాయకులు దాసరి అప్పారావు, భోగాపురపు పైడిరాజు, సిరిపురపు చిన్నికృష్ణ, బి.అప్పలరాజు,ఎస్సీనాయకులు నిమ్మకాయల సూరిబాబు, కన్నారావు, పి.అప్పారావు పాల్గొన్నారు.

అన్నమయ్య కీర్తనల శిక్షణ ప్రారంభం


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి

అగనంపూడి : అన్నమాచార్యుని సంకీర్తనలు ఆనందానుభూతి కలిగిస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి పునరావాస కాలనీ గవర వీధిలోని రామాలయంలో కాపారపు ఫౌండేషన్, గీతాచార్య భక్తి గీతాంజలి గౌరీ సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన వేదర్శ అన్నమాచార్య సంకీర్తన శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామికి సంకీర్తనలను అంకితం చేసి కైవల్యం పొందారన్నారు. నేటి సమాజంలో సనాతన ధర్మం, భక్తి భావన దూరం అవుతున్నాయని, ఈ క్రమంలో ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈనెల 24వ తేదీన సంకీర్తన యజ్ఞం నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాపారపు ఫౌండేషన్ ప్రతినిధి కాపారపు శివన్నాయుడు, భాస్కర్‌భట్ల సత్య ప్రసాద్‌శర్మ, బెండి సత్యం, శీపాన రమేష్ బాబు, పట్టా రామ అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, గన్నంరాజు గిరిబాబు, నాగమణి, వివిధ ప్రాంతాల భజన బృందాలు పాల్గొన్నాయి.

బంద కబ్జాకు స్కెచ్!

- సమీపంలోని గెడ్డవాగు పూడ్చివేత
- రాత్రి వేళ యంత్రాలతో పనులు చేపడుతున్న అక్రమార్కులు
- డీటీకి మహిళల ఫిర్యాదు


ఆక్రమణకు గురైందని ఆరోపిస్తున్న అప్పలనర్సయ్య బంద


డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు ఫిర్యాదు చేస్తున్న గెడ్డం వీధికి చెందిన మహిళలు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని అప్పలనరసయ్య బంద దురాక్రమణకు కబ్జారాయుళ్లు తెగబడ్డారు. సమీపంలోని గెడ్డవాగును పూడ్చేశారు. అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉంటే వీరు ఆక్రమణకు తెగబడ్డారు. కొద్ది రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ కబ్జా వ్యవహారం మహిళల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది.ఆక్రమణలకు బ్రేక్ వేయాలని సమీపంలోని గెడ్డంవీధికి చెందిన మహిళలు మంగళవారం డీటీ వెంకట్‌కు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు..

సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని సర్వే నెంబర్ 254లో అప్పలనర్సయ్య బంద ఉంది. ఈ బందను ఆనుకొని సర్వే నెంబర్ 233లో 3.08 ఎకరాల్లో గెడ్డవాగు ఉంది. అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో 20 రోజులుగా అప్పలనర్సయ్య బందతో పాటు దానికి ఆనుకొని ఉన్న గెడ్డవాగును కొంత మంది దురాక్రమణ చేసి యంత్రాలతో రాత్రి వేళ చదునుచేసి ప్లాట్లు వేస్తున్నారు. మంగళవారం అడ్డుకొనేందుకు వెళితే ఒక వ్యక్తి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిరిగేటట్టు చేస్తానని బెదిరింపులకు దిగాడని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ బందను డంపింగ్ యార్డుకు కేటాయిస్తే కొంతమంది అడ్డుకున్నారన్నారు. తర్వాత ఆక్రమణలకు పాల్పడితే అప్పటి తహసీల్దార్ సత్తి నాగేశ్వరరెడ్డి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని.. ఇప్పటికీ బందలో హెచ్చరిక బోర్డు ఉందని వివరించారు.సాగునీటి చెరువులు,గెడ్డవాగులు ఆక్రమణలకు గురైతే పశుపోషణతో పాటు వ్యవసాయం ఎలా చేసుకోవాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పలనర్సయ్య బందతో పాటు గెడ్డవాగును సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఆక్రమణలను అడ్డుకోవాలన్నారు. తమను బెదిరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమార్కులపై ఓల్టా చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన డీటీ వెంకట్ మూడు రోజుల్లో సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని మహిళలకు హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసినవారిలో గెడ్డం వీధికి చెందిన ఎల్. సంతోషి,గెడ్డం లలిత,గెడ్డం లక్ష్మి,గెడ్డం చిట్టమ్మ,జి. జయలక్ష్మి,గెడ్డం శ్యామల,జి. అనిత, సీహెచ్ వరలక్ష్మి, కొల్లి లక్ష్మితో పాటు సుమారు 30 మంది మహిళలు ఉన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సీడీపీవో లలితకుమారి

సబ్బవరం: మహిళలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి సూచిచారు. సబ్బవరం కోమటివీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మహిళలు, కిశోర బాలికలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 28 వరకు రుతుక్రమ సమయంలో మహిళలు పాటించాల్సిన పరిశుభ్రత, తీసుకోవాల్సిన ఆహారం మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లి లేదా తండ్రి ఆ సమయంలో అవగాహనతో వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పరిశుభ్రత పాటించకపోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్లు ఎక్కువగా వస్తున్నాయని ఆమె తెలిపారు. డెటాల్ సబ్బు ఉపయోగించవద్దని సూచించారు. అదేవిధంగా వేపాకు, పసుపు వేసి మరిగించిన నీటితో స్నానం చేయడం వల్ల చర్మ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు ఆర్.పైడితల్లి, వై.రమాదేవి, వై. ఇందిర, ఏఎస్ఎం అనురాధ, మహిళా పోలీస్ నళిని,అంగన్‌వాడీ టీచర్ ఎం. చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చిస్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

అంతా సామరస్యంగా మెలగండి

- డీఎస్పీ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ, సీఐ బాలసూర్యారావు

పరవాడ: పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఫలితాలు ఎలా వచ్చినా అంతా సామరస్య పూర్వకంగా మెలగాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. త్వరలో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించా రు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పండగలు, పబ్బాలు చేపట్టకూడదని సూచించారు. పల్లెల్లో ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు. కార్యక్రమా ల్లో పరవాడ సీఐ బాలసూర్యారావు, ఎస్ఐ సిరపరపు సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

23న ముత్యాలమ్మతల్లి పండగ

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీబ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగను ఈ నెల 23న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ రోజు ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పిస్తారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహిస్తారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, కోయడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల భారీ బాణ సంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

జీతాలు చెల్లించకపోవడం ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమే


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి: తొమ్మిది వందల కోట్ల రూపాయల అడ్వాన్స్ రూపేణా ఉక్కు యాజమాన్యం సేకరించినా నేటికి ఉక్కు ఉద్యోగులు జీతాలు చెల్లించకపోవడం, ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. 1,195 రోజులుగా ఆందోళన చేస్తున్నా, యాజమాన్యంలోగాని, ప్రభుత్వాల్లోగాని కనీసం స్పందన లేకపోవడం, కావాలని కార్మికుల జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడం అన్యాయమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉక్కులోని డెడికేషన్ పార్కు వద్ద బుధవారం ఉదయం పది గంటలకు వేలాది మంది కార్మికులు పాల్గొని నిరసన తెలపేందుకు నిర్ణయించామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో నియమితులైన ఉక్కు సీఎండీలు, డైరెక్టర్లు వివాదస్పదంగా వ్యవహరిస్తూ అనవసర ఖర్చులు తగ్గించకుండా యథేచ్ఛగా షికార్లు చేస్తున్నారని, ఈవిషయంలో ఉక్కు మంత్రిత్వశాఖ చోద్యం చూస్తోందని ఆరోపించారు. ఈవ్యవహారాలపై సీబీఐ, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మధు, పీఆర్‌కే రాజు, గుమ్మడి నరేంద్ర శ్రీనివాసనాయుడు, దాసరి శ్రీనివాస్, టక్కు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామి ఉత్సవ విగ్రహం

భీమునిపట్నం : భీమిలి సౌమ్య గిరిపై ఉన్న నరసింహస్వామి ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాల అభిషేకాలు, గంగ, నర్మద, గోస్తనీ నదుల జలాలతో అభిషేకాలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోండి


అధికారికి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల జీతాల చెల్లింపునకు రీజినల్ లేబర్ కమీషనర్ (ఆర్ఎల్‌సీ) చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ డీవీఆర్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం వారు ఆర్ఎల్‌సీ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 21వ తేదీ వచ్చినప్పటికి కార్మికులకు జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో పాటు డిఫాల్టర్లుగా మిగులుతున్నారన్నారు. వెంటనే జీతాల చెల్లింపుపై యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణారెడ్డి, అధ్యక్షుడు గల్లా శంకర్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

యూజర్ చార్జీల రద్దు కోరుతూ లేఖ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో చెత్తపై యూజర్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి లేఖ పంపారు. ప్రతి ఇంటికి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ చార్జీలు నిర్ణయించారని, ఈ చార్జీలను సీపీఎం కార్పొరేటర్‌గా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. తక్షణం కౌన్సిల్ సమావేశం నిర్వహించి చెత్తపై యూజర్ చార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

మస్తానప్పకు సత్కారం


మస్తానప్పను సత్కరిస్తున్న విభాగాధిపతి బాలకుమార్, కుమారస్వామి, నాయకులు

ఉక్కునగరం : స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్పను మంగళవారం సత్కరించారు. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా స్టీల్ మెల్ట్ షాప్-1 విభాగం వైఎస్సార్‌టీయూసీ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి బాలకుమార్, సీసీడీ ఇన్‌చార్జి కుమారస్వామి అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో ప్రతి ఒక్కరూ అభిమానించే అతి కొద్ది మంది నాయకుల్లో మస్తానప్ప ఒకరన్నారు. విభాగాల్లో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించడంలో ఆయన సలహాలు, సూచనలు ఆచరణీయంగా ఉంటాయన్నారు. మస్తానప్ప మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దరిగి రవి, బాబూరావు, ఎం. రాంబాబు, చంద్రశేఖర్, వర్మ, సేథి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం ,శేషవస్త్రాలు అందజేశారు.

అంబరాన్నంటిన సతివాడమ్మ తల్లి సంబరం


గొరపల్లిలో ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు


సతివాడమ్మతల్లి


జాతరలో పాల్గొన్న ప్రజలు

పెందుర్తి: గొరపల్లిలో వెలసిన ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సతివాడమ్మతల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలతో పూజలు చేశారు. చీరలు, ముడుపులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ప్రజలు పిండి వంటలు, పలు రకాల పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఎలేనుగు సంబరం అంబరాన్ని అంటింది. ఆనవాయితీగా ఉయ్యాల కంబాల ఘట్టం నిర్వహించారు. భజనలు, డప్పుల వాయిద్యాల నడుమ అనుపోత్సవం వైభవంగా చేశారు. పగటి వేషాలతో యువకులు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గొరపల్లి, కోట్నీవానిపాలెం, గంగమ్మపేట, గొల్లలపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, సంతపాలెం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

అప్పన్నకు లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ పూజలు


అప్పన్న ఆలయంలో లక్ష్మీకాంత్‌నాయక్‌దాస్

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు. ఒడిశాకు చెందిన భక్తులు ఆయన వెంట ఉన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా ధనస్వామ్యమే..

ఆదికవి నన్నయ్య వర్సిటీ వీసీ ముత్యాలనాయుడు


ప్రధానికి పంపిన లేఖ చూపిస్తున్న ప్రొఫెసర్ ముత్యాలనాయుడు

దాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించలేదని, ఎక్కడ చూసినా ధనస్వామ్యమేనని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టడి చేయాల్సిన వారే డబ్బులు పంపిణీ చేసి ఓటర్లకు గాలం వేయడం దారుణమన్నారు. దేశంలో ఎంతో సాధించామనే చెప్పే ప్రధాని మోదీ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత జరుగుతున్న చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయానికి సంబంధించి మోదీకి పంపిన లేఖను మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఓటర్లకు ప్రత్యక్ష డబ్బు బదిలీలు బాగా పెరగడంతో ప్రజాస్వామ్యం తుప్పు పట్టిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సగటున రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ప్రతి ఓటరుకు సగటున రూ.1, 500 నగదు ఇచ్చారని ఆరోపించారు. ఒక్క రాష్ట్రంలోనే సుమారు 3 కోట్ల మంది ఓటర్లకు ఇలా నగదు అందజేశారని, దీన్ని బట్టి దేశంలో ఏ మేరకు నగదు పంపిణీ చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావాలని మోదీకి పంపిన లేఖలో విజ్ఞప్తి చేశారు.